మంత్రికి ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 20 : అక్టోబర్ 2న నిర్వహించనున్న సదాశయ ఫౌండేషన్ వార్షికోత్సవానికి హాజరు కావాలని మంత్రి శ్రీధర్‌బాబును ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. విదేశాల్లో మాదిరిగానే మనిషి మరణానంతరం అవయవాల సేకరణకు చట్టం తేవాలని ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి కోరారు. అవయదాతల అంత్యక్రియలు ప్రభుత్వమే నిర్వహించి రూ. 10వేల అందజేయాలని, 108ను అవయవ సేకరణకు అనుసంధానం చేసి సేకరించాలని కోరారు.

ఇసుక లారీల పట్టివేత

సుల్తానాబాద్‌రూరల్, సెప్టెంబర్ 20: ఇసుక అక్రమంగా తరలిస్తున్న 9 లారీలను దుబ్బపల్లి వద్ద గురువారం అర్ధరాత్రి తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము తనిఖీలు చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. లారీలను సుల్తానాబాద్ ఠాణాకు తరలించినట్లు తెలిపారు. గొల్లపల్లిలోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు.

వేతనాలు పెంచాలని ధర్నా

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్20 : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాలు రూ. 26వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఇక్కడ అధ్యక్షుడు మహంకాళి సురేశ్, ప్రధాన కార్యదర్శి బొంకూరి సాగర్, నాయకులు కుక్క అన్వేశ్, సుద్దాల సతీశ్, గుండేటి లక్ష్మి, శంకర్, శ్రీనివాస్, బడుగు శ్రీనివాస్, ఆరెపల్లి ప్రమీళ, సలిగంటి సుశీల పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ధర్మారం,సెప్టెంబర్20: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బ్లాండీన సూచించారు. కొత్తపల్లి, ఎర్రగుంటపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పోషక మాసం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బుర్ర రేణుక, మంగారాణి,అరుణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్20: వానకాలం(2024-25) సీజన్ వడ్ల కొనుగోలుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. వానకాలం ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్‌లో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు. జిల్లాలో 4 .06 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందనే అధికారుల అంచనాతో 311 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చెల్లింపులు ఉంటాయని పేర్కొన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డీఆర్డీవో రవీందర్, ఆర్డీవో రంగారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు.

జిల్లాలో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుపై కలెక్టరేట్‌లో

గోదావరిఖని : సింగరేణి దవాఖానలో పర్యటిస్తున్న కలెక్టర్

శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద నిర్దేశించిన 12 రకాల వివిధ వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి మండలాల వారీగా పురోగతి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 8569 వ్యాపార యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3791 యూనిట్ల ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఇక్కడ అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవికుమార్, డీపీఎం, ఏపీఎంలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో కలెక్టర్ పర్యటన

గోదావరిఖని, జ్యోతినగర్, సెప్టెంబర్ 20: రామగుండం మండలంలో శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం పర్యటించారు. గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా దవాఖానను సందర్శించారు. కార్డియాలజీ విభాగం, క్యాజువాలిటీ, జనరల్ వార్డులను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. అంతకుముందు కలెక్టర్ ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు.పాఠశాలలో జరుగుతున్న గణిత కాంప్లెక్స్ శిక్షణలో పాల్గొని విద్యార్థులకు తరగతుల వారీగా సామర్థ్యం పెంపునకు కృషి చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. ఇక్కడ ఏసీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

బదిలీ కోసం సెలవులో రామగుండం కమిషనర్

- ఎఫ్ఏసీ కమిషనర్‌గా శివానందంకు బాధ్యతలు

కోల్‌సిటీ, సెప్టెంబర్ 20: రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సీటు ఎవరికీ అంతగా కలిసి రావడం లేదు. ప్రస్తుత కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ వచ్చి ఏడాది కాకముందే బదిలీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలోనే బదిలీ అవుతున్నారని ప్రచారం జరిగింది. ఇక తప్పనిసరి పరిస్థితిలో కమిషనర్ శ్రీకాంత్ ఈనెల 24 వరకు సెలవు పెట్టారు. దీనితో కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శివానందంకు ఎఫ్ఏసీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ స్థాయి అధికారి సెలవులో వెళ్లినప్పుడు అసిస్టెంట్ కమిషనర్ పదవిలో ఉన్నవారు అదనపు బాధ్యతలు చూసుకుంటారు. కానీ, కేవలం ఈ నాలుగు రోజులకే పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎఫ్ఏసీ కమిషనర్‌గా శివానందంకు బాధ్యతలు అప్పగించడం గమనార్హం. ఇప్పటి దాకా రామగుండం కార్పొరేషన్ చరిత్రలో ఇలాంటి పరిణామం జరిగిన సందర్భాలు లేవు. అసిస్టెంట్ కమిషనర్ ఉండగా, సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు ఎఫ్ఏసీఏ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించడంతో బదిలీ చేయించుకోవడం కోసమే సెలవుపై వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడకు కమిషనర్‌గా వచ్చిన నాగేశ్వరరావు కూడా కొద్ది రోజులు మాత్రమే కొనసాగి తర్వాత బదిలీ చేయించుకున్నారు. రామగుండం కార్పొరేషన్ అంటేనే అవినీతికి కేంద్ర బిందువనే మచ్చ ఉంది. ఆదాయ వనరులు అంతంత మాత్రంగానే ఉండడం, ఉద్యోగులకు జీతాలు చెల్లించడానికే గడ్డు పరిస్థితులు ఎదుర్కోవడం, అన్ని విభాగాల్లో చాలా వరకు అవకతవకలు జరుగుతుండడం, ప్రస్తుతం రాజకీయ నాయకులే రామగుండం కార్పొరేషన్‌ను శాసిస్తుండటం ఇవన్నీ వెరసి కమిషనర్ బదిలీ కోసం రాజధానికి వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చించుకుంటున్నారు.

ఆర్జీ-3 సివిల్ డీజీఎంగా రాజేంద్రకుమార్

రామగిరి, సెప్టెంబర్ 20: సింగరేణి ఆర్జీ-3 సివిల్ డీజీఎంగా రాజేంద్ర కుమార్‌ను నియమించారు. ఈమేరకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పని చేసిన డీజీఎం పద్మరాజు విరమణ పొందగా, ఆయన స్థానంలో ఇక్కడే పని చేస్తున్న డీవైఎస్ఈ రాజేంద్ర ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడకు కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో పని చేస్తున్న రాజేంద్ర కుమార్‌ను బదిలీ చేశారు. సివిల్ ఎస్ఈ బానోతు రాముని శ్రీరాంపూర్ డివిజన్ నుంచి మందమర్రి డివిజన్‌కు, ఈఈ సాయినాథ్ షిండేను ఆర్జీ-3 నుంచి కొత్తగూడెం సివిల్ కార్యాలయానికి, ఏఈ బైరి క్రాంతిని కొత్తగూడెంలోని సివిల్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మునుపెన్నడూ లేని విధంగా 33 శాతం వాటా

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

గోదావరిఖని, సెప్టెంబర్ 20: మునుపెన్నడూ లేని విధంగా సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం లాభాల వాటా 33శాతం ప్రకటించిందని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. సగటున ఒక్కో కార్మికుడికి రూ. 1.90 లక్షల చొప్పున రానున్నాయని పేర్కొన్నారు .

పోరాడింది ఏఐటీయూసీ

లాభాల వాటా 33శాతం వరకు పోరాడింది సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ యూనియన్ కృషి చేసిందని పేర్కొన్నారు. మిగిలిన 67శాతం యాజమాన్య వాటా నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు ఒకొక్కరికి రూ.5వేలు, వరద బాధితుల సహాయార్థం రూ.10.25 కోట్లు కూడా యాజమాన్య వాటా నుంచి చెల్లించేలా యాజమాన్యం, ప్రభుత్వాన్ని ఒప్పించిందని వెల్లడించారు.

పెద్దపల్లి-జూలపల్లి మార్కెట్ కమిటీల ఖరారు

పెద్దపల్లి, సెప్టెంబర్20: పెద్దపల్లి, జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలక మండళ్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి ఏఎంసీ చైర్ పర్సన్‌గా ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్‌గా కూర మల్లారెడ్డి, జూలపల్లి ఏఎంసీ చైర్మన్‌గా గండు సంజీవ్, వైస్ చైర్మన్‌గా కొమ్మ పోచాలు నియామకమయ్యారు. జిల్లాలోని 8 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు గాను ధర్మారం పాలక వర్గం ఇటీవల బాధ్యతలు స్వీకరించింది. తాజాగా పెద్దపల్లి, జూలపల్లి ఏఎంసీలకు పాలక వర్గం ఎట్టకేలకు ఖరారైంది. కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్, మంథని, కమాన్‌పూర్, రామగుండం ఏఎంసీలకు పాలక వర్గాలను ప్రకటించాల్సి ఉంది.

మెరిట్ అభ్యర్థులు సర్టిఫికెట్లు ఇవ్వాలి

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 20 : జిల్లాలోని పది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీ ఉన్న 26 అధ్యాపక పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు గత ఏడాది నిర్వహించిన పరీక్షలో మెరిట్ సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న స్పెషల్ ఆఫీసర్-1, సీఆర్‌టీ-13, పీజీ సీఆర్‌టీ-13 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలు www.peddapallideo.com లో పొందుపర్చినట్లు వివరించారు. ఈ ఉద్యోగాలకు మహిళా అధ్యాపకులు అర్హులని, మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలన చేసిన తర్వాత ఖాళీలను భర్తీ చేస్తామని వెల్లడించారు. స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్టీ పోస్టులకు సంబంధించిన అభ్యర్థులు ఈ నెల 23న, సీఆర్టీ అభ్యర్థులు ఈ నెల 24న విద్యాశాఖ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈవో సూచించారు.

నవంబర్ 26న నిరసన దినం

గోదావరిఖని, సెప్టెంబర్ 20: ఎన్‌డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు వచ్చే నవంబర్ 26న దేశవ్యాప్త నిరసన దినంగా పాటించాలని హెచ్ఎంఎస్ నేత రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. గత నెలలో జరిగిన సెంట్రల్ ట్రేడ్ యూనియన్, సెక్టోరల్ ఫెడరేషన్లు, సంయుక్త కిసాన్ మోర్చా వేదిక నిర్వహించిన సమావేశంలో కార్మికులు, రైతులు తమ డిమాండ్లపై సమన్వయం, ఉమ్మడి సామూహిక చర్యలను పెంపొందించేందుకు దేశవ్యాప్త నిరసన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కరోనా కాలంలో మూడు లేబర్ కోడ్‌లను ఆమోదించిన సెప్టెంబర్ 23ని బ్లాక్‌డేగా పాటిస్తూ ట్రేడ్ యూనియన్ల కార్యక్రమాలకు మద్దతుగా సంఘీభావం తెలపాలని కోరారు.

చెరువుల సర్వే పూర్తి

పెద్దపల్లి, సెప్టెంబర్20: పట్టణంలోని ఎల్లమ్మ, గుండం చెరువుల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. సర్వే, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు శుక్రవాం సంయుక్తంగా ఎల్లమ్మ, గుండం చెరువు చెరువుల సర్వే చేశారు. ఎఫ్‌టీఎల్ గుర్తించి జెండాలు పాతారు. ఇక్కడ సర్వే అండ్ ల్యాంగ్ రికార్డ్ ఏడీ శ్రీనివాసులు, సర్వేయర్ సునీల్, మున్సిపల్ టీపీవో వినయ్, ఇరిగేషన్ ఏఈఈ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 20: పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరి ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన డీహెచ్‌పీఎస్ జిల్లా సమావేశంలో మారుపాక అనిల్ మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీహెచ్‌పీఎస్ జిల్లా కన్వీనర్‌గా మద్దెల దినేశ్, కో-కన్వీనర్‌గా బండారి సదానందంలను నియమించారు. ఇక్కడ కందుకూరి రాజారత్నం, బొద్దుల రమేశ్, ఆసాల రమ, తిరుమల, ఆరెపల్లి మానస్ కుమార్, ఎర్రల రాజయ్య, చంద్రగిరి ఉదయ్‌కుమార్, ప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇనుముల సతీశ్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు?

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏగోలపు శంకర్‌గౌడ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంథని, సెప్టెంబర్ 20: మంథని మాజీ ఉపసర్పంచ్, డీసీసీ అధికార ప్రతినిధి ఇనుముల సత్యనారాయణ ఆలియాస్ సతీశ్‌ను పోలీసులు ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎగోలపు శంకర్‌గౌడ్ ప్రశ్నించారు. మంథని ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో క్రీయాశీలకంగా పనిచేస్తున్న ఇనుముల సతీశ్ మంథనిలో బ్లాక్ మెయిల్ దందాతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఇండ్లు, భవనాలు కట్టుకునే వారిని సతీశ్ బెదిరింపులకు గురి చేస్తూ వసూళ్లు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సతీశ్ ఆగడాలపై పోలీసులు కేసులు నమోదు చేయడం శుభపరిణామమన్నారు. కానీ ఎందుకు అరెస్టు చేయడం లేదో చెప్పాలన్నారు. ఏ-1గా సతీశ్‌ను అరెస్టు చేయని పోలీసులు ఏ-2గా ఉన్న రావికంటి సతీశ్‌ను మాత్రం అరెస్టు చేసి జైలులో పెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే అక్రమ వసూళ్లకు పాల్పడ్డ ఇనుముల సతీశ్‌ను పార్టీ నుంచి తొలగించడంతో శిక్ష పడేలా చేయాలని, అతని గ్యాంగ్‌లో ఉన్న వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాయితి సమ్మయ్య, మంథని లక్ష్మణ్, పెడగ శ్రీనివాస్, వేముల లక్ష్మయ్య, వేల్పుల గట్టయ్య, కొండా రవీందర్‌లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'పల్లవి' విద్యార్థుల ప్రతిభ

పెద్దపల్లి కమాన్ : పతకాలు సాధించిన పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 20 : పెద్దపల్లి పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో పలు పతకాలు సాధించారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 15 బంగారు, 8 వెండి, కాంస్య-11 పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ శోభారాణి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శోభారాణి వారిని అభినందించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ శ్రీదేవి, కరాటే మాస్టర్ వెంకటేశ్, పీఈటీ రాజు ఉన్నారు.

హరిపురం విద్యార్థుల ప్రతిభ

ఓదెల, సెప్టెంబర్ 20: ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హరిపురం ఉన్నత ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ద్యాగేటి శ్రీనిధి, గాధం రుచిత, గాజుల అక్షిత పతకాలు సాధించారని హెచ్ఎం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణారావు విద్యార్థినులు, ఉపాధ్యాయులను శుక్రవారం అభినందించారు. ఇక్కడ కరాటే మాస్టర్ కల్వల రమేశ్, చింతిరెడ్డి విజయేందర్‌రెడ్డి ఉన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన వార్షికోత్సవం

సర్టిఫికెట్లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, శిక్షకులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 20: పీఎంవిశ్వకర్మ యోజన ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పెద్దపల్లిలోని శాంతినగర్ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి వివిధ రకాల శిక్షకులు పాల్గొన్నారని జిల్లా ట్రైనింగ్ మేనేజర్ పల్లికొండ నరేశ్ తెలిపారు. వివిధ రంగాల్లో శిక్షణ పొంది ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలలు అందజేసి సన్మానించారు. పీఎం విశ్వకర్మ యోజనలో భాగంగా డేటా ప్రో ట్రైనింగ్ సెంటర్ వర్చువల్ కాన్ఫరెన్స్‌కి పెద్దపల్లి ఎంపికైంది. పెద్దపల్లి శిక్షణ కేంద్రంలో దాదాపు 550 మందిని ఎంపిక చేశారు. వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ప్రధాని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీఎం ఇన్‌చార్జి మోహన్‌దాస్, శిక్షణ పొందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గోదావరిఖని, సెప్టెంబర్ 20: ఆటో, మోటర్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎడ్ల రవికుమార్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఈ నెల 30న చేపట్టనున్న చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను గంగానగర్ లారీల యార్డ్ వద్ద శుక్రవారం విడుదల చేశారు. ఇక్కడ నాయకులు ఎం కొమురయ్య, నుచ్చుకొల్ల బాలకృష్ణ, బోడ రఘు, మహిపాల్, గాండ్ర సదయ్య, ఎస్‌డీ గౌస్, బండారి లక్ష్మీపతి, నరేశ్, రాజయ్య, వీటిరావు, తిరుపతిరెడ్డి, రమేశ్, గురుదత్తసాయి, శ్రీనివాస్, సదానందం ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

రామగిరి, సెప్టెంబర్ 20ః సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్జీ-3 ఓసీపీ-1 బేస్ వర్క్‌షాపులో శుక్రవారం లాభాల వాటా డిమాండ్‌తో ఈనెల 30న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నాకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. మహాధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు పీ రమేశ్, రాజనర్సు, నర్సయ్య, శ్రీనివాస్, అంజమ్మ, లింగయ్య, రాజమౌళి, ఇమామ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణవేణి' విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు

రామగిరి, సెప్టెంబర్ 20: మండలంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు సెమ్స్ ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. 2023-24లో జరిగిన సెమ్స్ ఒలంపియాడ్ పరీక్షల ఫలితాలు గత నెల చివరివారంలో విడుదల చేశారు. ఇందులో విద్యార్థులు పులి రేవర్షిణి, కొలిపాక కృష్ణ మనోహర్, ఆకుల రితిక, మిట్ట సాయి వర్షిత రాష్ట్ర స్థాయిలో 1,2,3,8 ర్యాంకులు సాధించారు. మరో 12 మంది విద్యార్థులు జోనల్ లెవల్ ర్యాంకులు సాధించారు. వీరిని ఒలంపియాడ్ కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, హెచ్ఎం బర్ల శ్రీనివాస్, ట్రస్మా అధ్యక్షుడు సమ్మారావు, డైరెక్టర్లు శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్ రెడ్డి, రంజిత్ రెడ్డిలు సన్మానించారు.

నియామకం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 20: పీఆర్టీయూ జిల్లా సహ అధ్యక్షుడిగా కోట లక్ష్మణ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు చొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని లక్ష్మణ్‌కు సూచించారు. తన నియామకానికి కృషి చేసిన సంఘం నాయకులకు లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 20: పెగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి సీహెచ్ వరుణ్‌కుమార్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం వరుణ్‌కుమార్‌ను మండల నోడల్ అధికారి మహేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతుధర్నాను విజయవంతం చేయాలి

పాలకుర్తి, సెప్టెంబర్ 20: రైతు రుణమాఫీ చేయకుండా, రైతు బంధు ప్రకటించకుండా అన్నదదాతలను నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా ఈసాలతక్కళ్లపల్లి ఇండియన్ బ్యాంకు ఎదుట బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. గ్రామంలోని బ్యాంకులో 1400 మంది ఖాతాదారులు పంట రుణాలు తీసుకుంటే, కేవలం 400 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిందని, ఇంకా 1000 మంది రైతుల కుటుంబాలు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి ఆధ్వర్యంలో ఈనెల 21 శనివారం పాలకుర్తి

ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి ముల్కల కొమురయ్య, నాయకులు బండి శ్రీనివాస్‌గౌడ్, హుస్సేన్, కనుకయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి

మంథని/మంథని రూరల్, సెప్టెంబర్ 20: పంటల్లో చీడ, పీడ నివారణ కోసం చర్యలు పాటిస్తే పత్తి, వరి పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ మంథని డివిజన్ ఏడీఏ అంజలి పేర్కొన్నారు. కూచిరాజ్‌పల్లి, పుట్టపాక, బిట్టుపల్లి(కే)లో వరి, పత్తి పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, రైతులున్నారు.

ముత్తారం, సెప్టెంబర్ 20: ఓడేడు గ్రామంలోని వరి పంటలను ఏవో అనూష పరిశీలించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇక్కడ ఏఈవో మనీషా, ఓడేడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ కల్పించాలి

పెద్దపల్లి, సెప్టెంబర్20: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ విద్యార్థి సంఘం, జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వరంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణ శ్రీకి వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న ఇప్పటి దాకా కులగణన చేపట్టలేదని విమర్శించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్ గౌడ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వొమురి శ్రీధర్, నాయకులు అలువాల రాజేంద